ప్రజాశక్తి

గురువారం 10 ఆగస్టు 2023

5

పార్వతీపురం మన్యం

నిర్వాసితుల సమస్యలపై

చంద్రబాబుకు సిపిఎం వినతి

ప్రజాశక్తి-గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లి ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన టిడిపి అధినేత చంద్రబాబునాయుడుకు సిపిఎం నాయకులు నిర్వాసితుల సమస్యలపై వినతి అందించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు బి.వి.రమణ, సుంకి సర్పంచ్ కరణం రవీంద్ర చంద్రబాబును కలిసి ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను వివరించారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చంద్రబాబు హామీనిచ్చారు. కార్యక్రమంలో సుంకి గ్రామ నిర్వాసితులు వేమల శ్రీనివాసరావు, సింహాచలం నాయుడు, సీతయ్య, ఆబ్బులు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తా

- తోటపల్లికి జంఝావతిని అనుసంధానిస్తా
- బహిరంగ సభలో చంద్రబాబునాయుడు
- పార్వతీపురానికి హామీల వర్షం

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి, గరుగుబిల్లి, పార్వతీపురం రూరల్

టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే తోటపల్లి, జంఝావతి సహా చిన్న చిన్న గెడ్డలైన అడారిగెడ్డ, గుమ్మడిగెడ్డ వంటి మినీ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తానని టిడిపి అధినేత చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. జంఝావతి నదిని తోటపల్లి ప్రాజెక్టుతోను, వంశధార, నాగావళి నదులకు చిన్న చిన్న నదులను అనుసంధానం చేస్తామని అన్నారు. రాష్ట్రంలో సాగునీటి ప్రోజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి కార్యక్రమంలో భాగంగా బుధవారం గురుగుబిల్లి మండలంలోని తోటపల్లి ప్రోజెక్టును మాజీ నీటిపారుదల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. కుడి,ఎడమ కాలువల పరిస్థితిని పరిశీలించిన అనంతరం ఉల్లిభద్ర ఎర్రన్న గుడి ప్రాంతంలో రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ముందుగా ఆదివాసీ దినోత్సవం సందర్భంగా అడవితల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రైతులను ఉద్దేశించి చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం వైఖరి వలన రాష్ట్రంలో అన్ని రంగాలు భ్రష్టుపట్టాయన్నారు. ఉత్తరాంధ్రలో 5 ప్రధాన నదులు, 69 పైగా ఉపనదులు ఉన్నాయని, వాటన్నింటినీ ప్రత్యేక ప్రణాళికతో అనుసంధానం చేసి ఉత్తరాంధ్ర కరువునివారణకు కృషి చేస్తామని తెలిపారు. ఇక్కడ మాజీ గిరిజన ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి.. టిడిపికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే కారణంతో తమ జాతికి చెందిన గిరిజనులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అధికారంలోకి వచ్చిన వెంటనే వారిపై చర్యలుంటాయని అన్నారు.

పార్వతీపురంపై హామీల వర్షం

పార్వతీపురంలో రోడ్డు షో సందర్భంగా చంద్రబాబుకు ప్రజలు స్వాగతంపలికారు. అనంతరం పాతబస్టాండ్ వద్ద జరిగిన సభలో మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ఈ ప్రాంత సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీల వర్షం కురిపించారు. తోటపల్లి ప్రాజెక్టును పూర్తిచేసి పార్వతీపురానికి సాగు, తాగునీరు అందిస్తానని హామీఇచ్చారు. పార్వతీపురానికి బైపాస్‌రోడ్డు తీసుకొస్తానని, ఏరియా ఆస్పత్రిని 200 పడకలుగా అభివృద్ధి చేస్తానని, డంపింగ్‌యార్డును పూర్తి చేస్తామని తెలిపారు. గిరిజనప్రాంత ప్రధాన సమస్యగా ఉన్న పుర్ణపాడు-లాబేసు వంతెన పూర్తి చేస్తామని, ఏనుగుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రహదారులకు మోక్షం కల్పిస్తామన్నారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయ్‌కుమార్‌కు పూర్తిగా సహకరించాలని కోరారు.

స్థానిక ఎమ్మెల్యే భూ కబ్జాలకు అడ్డుకట్ట వేయండి

స్థానిక ఎమ్మెల్యే తెల్లవారితే చాలు భూకబ్జాలు, సెటిల్‌మెంట్‌లు, బెదిరింపులకు పాల్పడుతున్నాడని, ప్రజలంతా అడ్డుకట్ట వేసి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని చంద్రబాబు అన్నారు. చెరువులను, ప్రభుత్వ భూములను ఆక్రమించేయడంతో పాటు అందరినీ బెదిరించి స్థలాలు లాక్కుంటున్నాడని అన్నారు. చెరువులు, ప్రభుత్వ భూములు ఆయన అబ్బసొమ్మా అని ప్రశ్నించారు. టిడ్కో ఇళ్లు పూర్తి చేసి ఐదేళ్లయినా లబ్ధిదారులకు అందజేయలేదన్నారు. పేదల ఇళ్ల పట్టాలపై సంతకాలు చేసి ఆయనే తహశీల్దార్‌గా, సబ్ రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తున్నాడని దుయ్యబట్టారు. కార్యక్రమంలో పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్‌గజపతిరాజు, గుమ్మడి సంధ్యారాణి, కిమిడి కళావెంకటరావు, దేవినేని ఉమామహేశ్వరరావు, శత్రుచర్ల విజయరామరాజు, వైరిచర్ల కిషోర్‌చంద్రదేవ్, మాజీ ఎమ్మెల్యేలు భంజ్‌దేవ్, తోయక జగదీశ్వరి, వీరేష్‌దేవ్, ద్వారపురెడ్డి జగదీష్ పాల్గొన్నారు.

తోటపల్లి రిజర్వాయరును పరిశీలిస్తున్న చంద్రబాబు

టిడిపి చేసింది శూన్యం

- ఆదివాసీలకు అండగా ఉన్నది మేమే
- ప్రపంచ ఆదివాసీ ఉత్సవాల్లో డిప్యూటీ సిఎం రాజన్నదొర
- అంబరాన్ని తాకిన సంబరాలు

స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మంత్రులు రాజన్నదొర, అమర్‌నాథ్, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కాంతిలాల్‌దండే, తదితరులు

ప్రజాశక్తి-సాలూరు

టిడిపి హయాంలో గిరిజనులకు చేసింది శూన్యమని, ఆదివాసీలకు అండగా నిలిచిందని తామేనని డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ప్రపంచ ఆదివాసీ ఉత్సవాలను ఆయన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అమర్‌నాథ్, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావు, జిసిసి చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముందుగా ఆదివాసీ సంప్రదాయ నృత్యాలతో గిరిజన మహిళలు మంత్రులకు స్వాగతం పలికారు. అనంతరం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ శాఖల స్టాళ్లను తిలకించారు. తర్వాత ఆదివాసీ జెండాని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో రాజన్నదొర మాట్లాడుతూ 1/70 చట్టం, ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం, పీసా చట్టం, అటవీ హక్కుల చట్టాలు గిరిజన అభివృద్ధికి దోహదపడ్డాయని చెప్పారు. వైసిపి ప్రభుత్వ హయాంలో 1.5 లక్షల మందికి 2.6 లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేసినట్లు తెలిపారు. 14 ఏళ్ళ రాష్ట్రాన్ని పాలించిన చంద్రబాబు నాయుడు కేవలం 16 వేల మందికి 40 వేల ఎకరాల భూమి మాత్రమే పంపిణీ చేశారని గుర్తుచేశారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో షెడ్యూల్ గ్రామాల గుర్తింపు కోసం కమిటీ వేసినట్లు తెలిపారు. త్వరలో ఈ కమిటీ సభ్యులు జిల్లాలో పర్యటించి గిరిజన సంఘాల నాయకులను కలుస్తారని చెప్పారు. జిఒ 3 రద్దుకు వ్యతిరేకంగా ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేసిందని చెప్పారు. గిరిజన సలహామండలిలో తీర్మానం కూడా చేసినట్లు తెలిపారు.

జెండాను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సిఎం

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ గిరిజనులు మొదటి నుంచి వైసిపికి అండగా నిలుస్తున్నారని చెప్పారు. నాలుగేళ్లలో లక్షా 50 వేల మందికి ఇళ్లు మంజూరు చేసిన ఘనత వైసిపిదేనని తెలిపారు. జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ వెనుకబడిన మన్యం జిల్లాకు వైద్య కళాశాల మంజూరు చేసిన ఘనత సిఎం జగన్‌దేనని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు ఇక నుంచి కాస్మోటిక్ ఛార్జీలు జిసిసి ద్వారా మంజూరవుతాయని చెప్పారు.

అనంతరం ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావు, జిసిసి చైర్ పర్సన్ స్వాతిరాణి, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ మురళి, పాచిపెంట ఎంపిపి బి.ప్రమీల, ఎస్‌టి సెల్ జిల్లా కన్వీనర్ కొండగొర్రి ఉదయ్ కుమార్ మాట్లాడారు. సీనియర్ గిరిజన నాయకులు, ప్రజాప్రతినిధులు ముఖ్వల ఆదియ్య, తాడంగి కన్నం నాయుడు, చింత సీతయ్యను సత్కరించారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్, జెసి గోవిందరావు, డిడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళారూపాలు

ఆశ్రమ పాఠశాలల విద్యార్థినులు, పాడేరు, అరకు, సీతంపేట ప్రాంతాలకు చెందిన గిరిజనులు చేసిన ఆదివాసీ కళారూపాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. మన్యం జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి వచ్చిన గిరిజనులతో సభా ప్రాంగణం కోలాహలంగా మారింది. మధ్యాహ్న భోజన విరామం తర్వాత గిరిజన బాలికలతో కలిసి డిప్యూటీ సీఎం రాజన్నదొర చేసిన నృత్యం ఆకట్టుకుంది.

సీతంపేటలో..

సీతంపేట : సీతంపేట ఐటిడిఎలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఐటిడిఎ పిఒ కల్పనకుమారి ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. అడవితల్లి విగ్రహం వద్ద పూజా కార్యక్రమాలతో ఉత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాలకొండ, పాతపట్నం ఎమ్మెల్యేలు వి.కళావతి, రెడ్డి శాంతి, ఎమ్మెల్సీ విక్రాంత్, సబ్‌కలెక్టర్ నూరుల్ కమల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐటిడిఎ పిఒ కల్పనకుమారి మాట్లాడుతూ ఐటిడిఎ ద్వారా చేపట్టిన కార్యక్రమాలు, అభివృద్ధిని వివరించారు. ఎమ్మెల్యే కళావతి మాట్లాడుతూ గిరిజనుల కోసం సీతంపేటలో 100 పడకల మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే రెడ్డి శాంతి, సబ్ కలెక్టర్ నూరుల్‌కమల్ మాట్లాడారు. గిరిజన సంప్రదాయం ఉట్టిపడేలా నృత్యాలను విద్యార్థులు, గిరిజన కళాకారులు ప్రదర్శించారు. అడవితల్లి విగ్రహం నుంచి డప్పులు, నృత్యాలతో ర్యాలీ చేపట్టారు. గిరిజన వేషధారణలో పిఒ కల్పన కుమారి, ఎమ్మెల్యే కళావతి గిరిజనులతో థింసా నృత్యం చేశారు. అనంతరం హార్టికల్చర్, అంగన్వాడీ, వ్యవసాయ శాఖ, జిసిసి స్టాళ్లను సందర్శించారు. కార్యక్రమంలో ఎంపిపిలు బి.ఆదినారాయణ, తోట సింహాచలం, జెడ్‌పిటిసి లక్ష్మి, ఎఎంసి చైర్మన్ మోహన్‌రావు, రాము, గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సత్యారావు, కార్యదర్శి జన్ని అప్పన్న, జిల్లా అధ్యక్షులు ఎ.మన్మథరావు, ప్రధాన కార్యదర్శి కె.కాంతారావు, సర్పంచ్ కళావతి, వైస్ ఎంపిపి సరస్వతి, ఎంపిటిసిలు చంద్రశేఖర్, ట్రైబల్ వెల్ఫేర్ ఇఇ సింహాచలం, డిడి శ్రీనివాసరావు, పిహెచ్ఒ వెంకటేష్, పిఎఒ హరికృష్ణ, డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి, డిప్యూటీ డిఎంహెచ్ఒ చిరంజీవి, ఎటిడబ్ల్యు మంగవేణి, సిడిపిఒ రామలక్ష్మి పాల్గొన్నారు.

గిరిజన మహిళలతో కలిసి థింసా నృత్యం చేస్తున్న ఐటిడిఎ పిఒ కల్పన, ఎమ్మెల్యే కళావతి

గిరిజనులపై పాలకుల నిర్లక్ష్యం

- ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ కోలక అవినాష్
- ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నూతన చట్టాలను తీసుకొచ్చి ఆదివాసీల జీవన విధానంపై తీవ్ర దాడి చేస్తోందని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ కోలక అవినాష్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గుమ్మలక్ష్మీపురం గ్రామంలో ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యాన భారీర్యాలీ నిర్వహించారు. అనంతరం వైటిసిలో సమావేశం నిర్వహించారు. ప్రయివేట్ కంపెనీలకు ఇష్టారాజ్యాంగ అనుమతులు ఇస్తూ తరతరాల నుంచి అడవినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న ఆదివాసీ గిరిజనులను బాక్సైట్ తవ్వకాల పేరుతో దూరం చేస్తున్నారని మండిపడ్డారు. గిరిజనులకు వెన్నెముకగా ఉన్న జిఒ 3 రద్దు చేసి ఉద్యోగ అవకాశాలు లేకుండా చేసిందన్నారు. 1/70 చట్టం పకడ్బందీగా అమలు చేయడం లేదన్నారు. గిరిజన అభివృద్ధి కోసం ఏర్పడ్డ ఐటిడిఎ, జిసిసిలకు నిధులు లేక అభివృద్ధి కుంటుపడిందన్నారు. అటవీ హక్కుల చట్టం, పీసా చట్టం, ఉపాధి హామీ చట్టాలను ఎత్తివేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఏజెన్సీలో 16 ఏళ్లుగా ఏనుగులు సంచరిస్తున్నా, వాటిని తరలించడంలో స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపడం లేదన్నారు. బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి మాట్లాడుతూ గిరిజన అభివృద్ధి కోసం ఏర్పడిన ఐటిడిఎలు రాజకీయ వేదిక మారాయని మండిపడ్డారు. ఆదివాసీ ఉత్సవాల సందర్భంగా పలు పాఠశాల విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో వేదిక నాయకులు మండంగి రమణ, ఇంటికొప్పల గౌరీ శంకర్, రొబ్బ లోవ రాజు, తోట రమేష్, కడ్రక మల్లేశ్వరరావు, పాలక క్రాంతికుమార్, అడ్డాకుల చిన్నారావు, తాడంగి దమయంతి, కూరంగి సీతారాం, పువ్వల సత్యనారాయణ, పత్తిక శంకర్రావు, పత్తిక ప్రసాదరావు, బిడ్డిక కూర్మారావు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక నాయకులు, గిరిజనులు

పార్వతీపురంరూరల్ : ములగ పంచాయతీ లచ్చన్నదొరవలసలో ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.రామస్వామి మాట్లాడుతూ అడవి నుండి గిరిజనులను దూరం చేయడానికి ప్రభుత్వం కుట్రపన్నుతోందన్నారు. దీన్ని తిప్పికొట్టాలని గిరిజనులను కోరారు.

సాలూరు రూరల్ : తరతరాలుగా ప్రభుత్వాలు గిరిజనులను మోసం చేస్తున్నాయని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సీదరపు అప్పారావు అన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గేమ్మిల జానకిరావు అధ్యక్షతన ర్యాలీ నిర్వహించారు. అనంతరం దండిగాం రోడ్‌లో సిఐటియు కార్యాలయంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఉన్న గిరిజన శాఖ మంత్రి కనీసం వ్యతిరేక చట్టాలపై మౌనం వహించడం దారుణమన్నారు. మణిపూర్లో అల్లర్లకు కారణమైన వారందరినీ చట్టప్రకారం శిక్షించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జన్ని రామయ్య, మంచాల శ్రీనివాసరావు, గూడెపు పోలిరాజు, మెల్లిక అయోధ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు కె.రమేష్, పి.వెంకటస్వామి, ఎస్.పారయ్య, డి.నాని, సిఐటియు నాయకులు ఎన్‌వై నాయుడు ,వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తాడంగి గాసి, మర్రి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : ఆదివాసీ హక్కులను కాపాడుకొనేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఊయక వెంకటేష్, ఊయక రామస్వామి కోరారు. అంటివలస గ్రామంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి మాట్లాడారు, ఆది, రాము, వెంకటేష్, సుబ్బారావు, అనిల్, రాజేష్, మధు పాల్గొన్నారు.

కొమరాడ.. ర్యాలీ చేపడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు, గిరిజనులు

ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో విద్యార్థినుల నృత్య ప్రదర్శన

గిరిశిఖర గ్రామాల్లో గజరాజుల సంచారం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో తిత్తిరి పంచాయతీలోని గిరిశిఖర గ్రామాల్లో బుధవారం నాలుగు ఏనుగుల గుంపు సంచారించింది. గిరిజనుల సాగు చేస్తున్న కొండచీపుర్లు, అరటి, పసుపు తదితర అటవీ ఉత్పత్తులను, తాగునీటి పైపులు, ట్యాంకులను ధ్వంసం చేస్తున్నాయి. ఇంతవరకు ప్రశాంతంగా ఉన్న గిరి శిఖర గ్రామాల్లో ఏనుగులు సంచరించడంతో ఏ క్షణాన ఏం జరుగుతుందో అని గిరిజనులు భయభ్రాంతులకు గురవుతున్నారు. తెల్లవారితే కొండ ప్రాంతంలో పనిచేసుకుంటూ అటవీ ఫలసాయాలను ఏరుకుంటూ జీవనం సాగిస్తుంటామని, ఏనుగుల సంచారంతో ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే భయమేస్తోందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొండలపై సంచరిస్తున్న ఏనుగుల గుంపు

12న సామూహిక నిరసనలు

ప్రజాశక్తి-సీతానగరం

ఈ నెల 12న పార్వతీపురంలో 12 గంటల సామూహిక నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఫ్యాప్టో మండల నాయకులు అరసాడ మోహనరావు, రెడ్డి శంకరరావు, పోలా సత్యనారాయణ, పల్లి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ప్రాథమిక పాఠశాలల పరిధిలో బుధవారం ఉపాధ్యాయుల సమస్యలపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జిఒ రద్దు చేయాలన్నారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి నిరంకుశత్వం విడనాడాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాడ్ చేశారు. వీటిపై చేపట్టే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు బొత్స ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న ఉపాధ్యాయులు, ఫ్యాప్టో నాయకులు

బతుకు తెరువు కోసం వెళ్లి...

విశాఖలో ఇద్దరు పిల్లలతో తల్లి ఆత్మహత్య

పాతబొబ్బిలిలో విషాదఛాయలు

ప్రజాశక్తి-బొబ్బిలి

బతుకు తెరువు కోసం పదేళ్ల క్రితం కుటుంబమంతా విశాఖ వెళ్లారు. విశాఖ మర్రిపాలెంలో హుడా లేఅవుట్లో పని చేసుకుని జీవనం సాగిస్తున్నారు. కుటుంబ కలహాలు రావడంతో ఇద్దరు పిల్లలతో సహా తల్లి ఆత్మహత్య చేసుకోవడంతో పాత బొబ్బిలిలో తీవ్ర విషాదం అలముకుంది.

పాత బొబ్బిలికి చెందిన గులిపల్లి లక్ష్మణ్, భార్య సంధ్య(32), కుమారుడు గౌతమ్(7), కుమార్తె ఆలేఖ్య(5) కలిసి విశాఖ మర్రిపాలెంలోని హుడా లేఅవుట్లో జీవనం సాగిస్తున్నారు. లక్ష్మణ లేఅవుట్లో ఉన్న ప్రకాష్ రెసిడెన్సీలో వాచ్‌మెన్‌గా పని చేయడంతో పాటు తాపీ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్యాభర్తల మధ్య గొడవలు జరిగినట్లు తెలిసింది. ఈనేపథ్యంలో మంగళవారం రాత్రి భర్త నిద్రలోకి వెళ్లిన తర్వాత పిల్లలను తీసుకుని సంధ్య తన ఇద్దరు పిల్లలను తీసుకొని వెళ్లి అపార్టుమెంట్‌పైన నీరు నిల్వ చేసుకునే సంపులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. లక్ష్మణ్ కు మధ్యలో మెలుకువ రావడంతో పక్కన భార్య, పిల్లలు లేకపోవడంతో అపార్ట్మెంట్ లో ఉన్నవారిని నిద్ర లేపి వేతికాడు. సంపు పైకప్పు తీసి ఉండడంతో అనుమానం వచ్చి చూడగా సంధ్య, పిల్లలు విగత జీవులుగా కనిపించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్ కు మతదేహాలను తరలించారు. కుటుంబ కలహాలు వలనే ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తుంది.

భర్త లక్ష్మణ్‌తో సంధ్య, పిల్లలు (ఫైల్)

పాత బొబ్బిలిలో విషాదం

జీవనోపాధి కోసం వెళ్లిన గులిపల్లి లక్ష్మణ భార్య సంధ్య, ఇద్దరు పిల్లలు ఆత్మహత్య చేసుకోవడంతో పాతబొబ్బిలిలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్వగ్రామం వచ్చినప్పుడల్లా లక్ష్మణ, ఆయన భార్య సంధ్య, పిల్లలు అందరితో కలిసి,మెలిసి ఉండేవారని గ్రామస్తులు చెపుతున్నారు. సంధ్య, ఇద్దరు పిల్లలు మరణవార్త వినడంతో కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపిస్తున్నారు. కడసారి చూసేందుకు కుటుంబ సభ్యులు, బంధువులు విశాఖ తరలి వెళ్లారు.

సైనికుడిని సన్మానిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

స్వాతంత్ర్య స్ఫూర్తితో పల్లెల అభివృద్ధి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

స్వాతంత్ర్య స్ఫూర్తితో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. బుధవారం పార్వతీపురం మండలం ఎంఆర్ నగరంలో ఆజాదికా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ స్థాయిలో నా మట్టి - నా దేశం అనే కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే అలజంగి జోగారావుతో కలిసి శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం సచివాలయ పరిసరాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామానికి చెందిన సైనికుడిని సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ నిర్మాణం కోసం గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, ఎంపిడిఒ జి.వి.రమణమూర్తి, జెడ్‌పిటిసి కృష్ణుడు, సర్పంచ్ వంగపండు లక్ష్మీ త్రినాథనాయుడు, కార్యదర్శి గట్టు భాస్కరరావు పాల్గొన్నారు.

సర్వే రాళ్లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-పాచిపెంట

రీసర్వేను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ హేమలత

జిల్లాలో సర్వే పూర్తయిన గ్రామాల్లో సర్వే రాళ్లు ఏర్పాటు చేయాలని ఆర్‌డిఒ కె.హేమలత అన్నారు. మండలంలోని గడ్డవలస, కేసలి, ఆలూరు గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. గ్రామాల్లో సర్వే రాళ్ల ఏర్పాటును బుధవారం తనిఖీ చేశారు. త్వరితగతిన సర్వే రాళ్ల ఏర్పాటు పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు పూర్తయిన భూములకు స్టోన్ ప్లాంటేషన్‌లో వేగవంతం పెంచి శత శాతం పూర్తి చేయడానికి కృషి చేయాలన్నారు. ఇందుకు అధికారులు రైతులు సహకారం కూడా అవసరమని సూచించారు. రీ సర్వేను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఆర్.రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎస్‌ఎఫ్‌ఐ సైకిల్‌యాత్ర

- వేలాది మందితో నగరంలో భారీ ప్రదర్శన
- 20 రోజుల్లోగా సమస్యలు పరిష్కరించకుంటే ఉధృత ఉద్యమం
- బహిరంగ సభలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

బహిరంగ సభలో అభివాదం చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మయూక్ బిశ్వాస్ అశోక్ రామ్మోహన్ తదితరులు

జిల్లాలో విద్యారంగ అభివృద్ధి కోసం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన చేపట్టిన విద్యార్థి సంగ్రామ సైకిల్‌యాత్ర బుధవారం ముగిసింది. గతనెల 31న కొత్తవలసలో ప్రారంభమైన ఈ యాత్ర పదిరోజులపాటు పది మండలాల్లో సంక్షేమ వసతి గృహాలు, ప్రభుత్వపాఠశాలలు, కళాశాలలను పరిశీలిస్తూ, విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటూ సాగింది. యాత్ర ముగింపు సందర్భంగా నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి బాలాజీ జంక్షన్ వరకు వేలాది మంది విద్యార్థులు భారీ ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు ఎస్‌ఎఫ్‌ఐ జెండాలు చేతపట్టి విద్యా వ్యతిరేక విధానాలపై నినదించారు.

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత ప్రధాన కార్యదర్శి మయూక్ బిశ్వాస్, రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సి.హెచ్.వెంకటేష్, పి.రామ్మోహన్‌తో మరో 70 మంది విద్యార్థులు సైకిల్‌యాత్రతో ప్రదర్శన అగ్రభాగాన సాగారు. అనంతరం జిల్లా అధ్యక్షులు వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సభలో మయూక్ బిశ్వాస్ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం, మోడీకి పార్లమెంట్‌లో ఉన్న రాష్ట్రాలో వైసిపి ప్రభుత్వం ఎన్‌ఇపి అమలు చేసి మనకు భవిష్యత్ లేకుండా చేస్తున్నాయన్నారు. సైకిల్ యాత్రలో హాస్టల్లో మరుగుదొడ్ల సౌకర్యం లేదని మన దృష్టికి వచ్చిందని, విద్యార్థులకు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించని మోడీ ప్రభుత్వం డిజిటల్ ఇండియా సాధిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విద్య ప్రైవేటీకరణకు, వ్యాపారీకరణకు వ్యతిరేకంగా, రానున్న కాలంలో ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకునేందుకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ మాట్లాడుతూ విద్యారంగం అభివృద్ధి కావడం ద్వారానే జిల్లా,రాష్ట్రం సమగ్రాభివృద్ధి జరుగుతుందన్నారు. అధికారంలోకి వస్తే ఎల్‌కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్య అందిస్తామని చెప్పిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జీవో 77 ను తీసుకొచ్చి పేద విద్యార్థులకు పిజి విద్య అందకుండా చేశారన్నారు. రాష్ట్రంలో ఎన్‌ఇపి అమలు చేయడం ద్వారా ఇప్పటికే సింగిల్ టీచర్ స్కూళ్లు 14వేలు మూతపడ్డాయని అన్నారు. వీటిలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్న మరో 25 వేల స్కూళ్లు మూతపడేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. సెంట్రల్ జైల్లో ఉన్న ఖైదీలకు మెస్ ఛార్జీలు రోజుకు రూ. 90 ఇస్తుంటే విద్యార్థులకు కేవలం రూ.35 ఇస్తున్నారని, దీంతో మూడుపూటలా భోజనం ఎలా చేయాలని ప్రశ్నించారు. మెడికల్ కాలేజీ సీట్లు అమ్మకాన్ని ఆపి, పేదలకు సీట్లు వచ్చే విధంగా చూడాలన్నారు. స్కాలర్ షిప్స్,విద్యా దీవెన ,అమ్మ ఒడిలో కోతలు మానుకొని అందరికీ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర బాలికల విభాగం కన్వీనర్ పావని మాట్లాడుతూ సైకిల్ యాత్ర లో విద్యార్థినుల బాధలు కళ్ళారా చూశామన్నారు. సరైన వైద్య సౌకర్యం, మరుగుదొడ్ల సౌకర్యం చాలా వసతి గృహాల్లో లేవన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి పి రామ్మోహన్ మాట్లాడుతూ పదిరోజులుపాటు 400 కిలోమీటర్లు ప్రయాణించి హాస్టల్స్, స్కూళు ,,జూనియర్,డిగ్రీ కాలేజీల్లో విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నామన్నారు. ఏహాస్టల్‌లోనూ మరుగుదొడ్లు సరిగా లేవన్నారు. పోరాడి సాధించిన విజయనగరం, గజపతినగరం డిగ్రీ కాలేజీల్లో అధ్యాపకులు లేరన్నారు. కొత్తవలస లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రైవేటు విద్యా సంస్థలలో ఫీజుల దోపిడీని అరికట్టేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సైకిల్ యాత్ర ద్వారా గుర్తించిన సమస్యలు 20 రోజుల్లోగా పరిష్కరించకపోతే కల్టెరేట్‌ను, విద్యా శాఖ మంత్రి ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు.

అనంతరం ఎస్ ఎఫ్ ఐ జిల్లా బాలికల విభాగం కన్వీనర్ సౌమ్య మాట్లాడుతూ జగన్ మామయ్య, మోడీ తాతయ్యలు ప్రభుత్వ విద్యా రంగాన్ని నాశనం చేస్తుంటే విద్యార్థులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే, ప్రభుత్వ విద్యను పేదలకు దూరం చేస్తే మిమ్మల్ని ప్రజలనుంచి దూరం చేసేలా ఉద్యమిస్తామని అన్నారు. విశాఖపట్నం జిల్లా కార్యదర్శి ఎల్‌జె నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో రక రకాల యాత్రలు వారి రాజకీయ అవసరాలు కోసం,పదవులు కోసం జరుగుతున్నాయని, ఎస్‌ఎఫ్‌ఐ చేపట్టిన సైకిల్ యాత్ర మన భవిష్యత్ కోసం,ప్రభుత్వ విద్యను కాపాడుకునేందుకు జరిగిందని అన్నారు. సమస్యలు పరిష్కారం కాకుంటే ప్రభుత్వాలపై విద్యార్థులు తిరుగుబాటుకు సిద్ధం కావాలనికోరారు. సభలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు డి.రాము, హర్ష సైకిల్ యాత్ర చేపట్టిన నాయకులు పాల్గొన్నారు. సైకిల్ యాత్ర చేపట్టిన విద్యార్థి బృందాన్ని మయూక్ బిశ్వాస్ అభినందించారు.

బహిరంగ సభకు హాజరైన విద్యార్థులు

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ జగన్నాథరావు

డిఎంహెచ్‌ఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని చినబోగిలి వెల్‌నెస్ సెంటర్‌ను డిఎంహెచ్‌ఒ బి.జగన్నాథరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడి, సేవలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎం.ఉష, ఎఎన్‌ఎం విజయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సిసిగా సత్యంనాయుడు

ప్రజాశక్తి-సీతానగరం

వైకెపి బూర్జ క్లస్టర్ కోఆర్డినేటర్‌గా మరడాన సత్యంనాయుడు బుధవారం విధుల్లో చేరారు. ఆయన జియ్యమ్మవలస మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు ఎపిఎం ఆర్.శ్రీరాములు తెలిపారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని వీరఘట్టం, బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో బుధవారం వైద్యాధికారులు గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. రక్తపోటు, బరువు, ఎత్తు, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి సూచనలిచ్చారు. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు శాంతికుమారి, నయోమి పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని పెదంకలాం, సీతానగరం పిహెచ్‌సిల్లో బుధవారం గర్భిణులకు వైద్యులు పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు ఎం.రాధాకాంత్, కె.శిరీష మాట్లాడుతూ గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వరలక్ష్మి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

'వారాహి యాత్రను విజయవంతం చేయాలి'

ప్రజాశక్తి-వీరఘట్టం

విశాఖపట్నంలో గురువారం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో చేపట్టే వారాహి యాత్రను విజయవంతం చేయాలని జనసేన మండల నాయకులు ఎం.పుండరకం, వి.రవికుమార్ ఒక ప్రకటనలో కార్యకర్తలను కోరారు. వారాహి యాత్రకు మండలంలోని అన్ని గ్రామాల నుండి జనసేన కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తిచేశారు.

ర్యాలీ చేపడుతున్న విద్యార్థులు

సైన్స్ పట్ల ప్రేమ కలిగి ఉండాలి

ప్రజాశక్తి-వీరఘట్టం

సైన్స్ పట్ల విద్యార్థులు ప్రేమ కలిగి ఉండాలని మన్యం జిల్లా సైన్సు అధికారి జి.లక్ష్మణరావు విద్యార్థులకు సూచించారు. బుధవారం మండలంలోని బిటివాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో హిరోషిమా, నాగసాకి డే సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అణు విస్ఫోటం వల్ల అధిక నష్టాలు మాదిరిగా, లాభాలూ పొందవచ్చని విద్యార్థులకు వివరించారు. హెచ్‌ఎం. సిహెచ్ రత్నాకర్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించవచ్చన్నారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

అనాథాశ్రమంలో మహేష్‌బాబు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-పాలకొండ

సినీనటుడు మహేష్‌బాబు పుట్టినరోజు వేడుకలను బుధవారం అన్నవరం ఆశ్రమంలో ఘనంగా నిర్వహించారు. అనాథాశ్రమంలో ఉన్న విద్యార్థులకు పుస్తకాలు, క్రికెట్ బ్యాట్లతోపాటు బియ్యం బస్తాలు, వంట నూనెలను వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఎద్దు లిల్లీపుష్పనాథం, కడగల వెంకటరమణ, రుంకు రామకృష్ణ, ముదిలి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమం

ప్రజా సంఘాల ఆధ్వర్యాన ర్యాలీ, ధర్నా

ప్రజాశక్తి-కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని ప్రజాసంఘాలు పిలుపునిచ్చాయి. బుధవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పార్వతీపురంలోని సుందరయ్య భవనం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం ధర్నా నిర్వహించారు. కలెక్టర్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను తిప్పికొట్టాలని కోరారు. బిజెపి దేశంలో అధికారం చేపట్టిన తర్వాత కార్పొరేట్లకు దాసోహమై కార్మికులను, రైతులను, ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. రైతులు పండించే పంటలపైన కార్పొరేట్లకు పెత్తనం అప్పజెప్పి నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు బిజెపి కారణమైందని విమర్శించారు. కార్మికుల హక్కులు హరించే విధంగా చట్టాలను మార్చి కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేకుండా చేస్తోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుపరం చేయాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. మణిపూర్ మత చిచ్చు రేపి, అక్కడ ఉన్న గిరిజన ప్రాంతంలో ఖనిజాలను కార్పొరేట్లకు ధారాదత్తం చేయాలని కుట్ర పన్నిందని మండిపడ్డారు. అందులో భాగంగానే మహిళలను నగ్నంగా ఊరేగించడంతో దేశ ప్రజలు తలదించుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. రైతుల పంటలకు మద్దతుధర లేదని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయడం లేదని తెలిపారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో మోడీ నాయకత్వంలోని బిజెపిని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి దావాల రమణారావు, యమ్మల మన్మథరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు, ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు, ఎఐకెఎంఎస్ నాయకులు రమణి, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు బొత్స నర్సింగరావు, ఎఐటిఎఫ్ నాయకులు దుర్గమ్మ, ఐఎఫ్‌టియు నాయకులు సర్వేశ్వరరావు, అఖిలభారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం నాయకులు పి.సంగం, ఎఐసిసి నాయకులు దామోదర్, సిఐటియు నాయకులు బి.వి.రమణ, గేదెల సత్యనారాయణ, బంకుర సూరిబాబు, రాము, వెంకటరమణ, శాంతి, తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

నేడు డి వార్మింగ్ డే

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండలంలో రావివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గ్రామాలలో గురువారం డి వార్మింగ్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి కర్రి అరుణకుమారి తెలిపారు. పిహెచ్‌సిలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. సీజనల్ వ్యాధులపై గ్రామస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. జ్వర లక్షణాలతో ఎవరు వచ్చినా వెంటనే పరీక్షలు చేసి, చికిత్స అందజేయాలని సిబ్బందికి సూచించారు. ఈ నెల 12 వరకు చేపట్టే మిషన్ ఇంధ్ర ధనుష్ కార్యక్రమానికి టీకాల కోసం సర్వేలో గుర్తించిన పిల్లలు, గర్భిణులను యూవిన్‌లో అప్లోడ్ చేయాలన్నారు.

స్కీమ్‌వర్కర్ల శ్రమదోపిడీ

ప్రజాశక్తి-వీరఘట్టం

స్కీమ్‌వర్కర్లను మోడీ ప్రభుత్వం శ్రమదోపిడీ చేస్తోందని సిఐటియు మండల నాయకులు ఎన్.ప్రసాదరావు, పి.ప్రసాదరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో కరపత్రాలతో స్కీమ్‌వర్కర్లు నిరసన చేశారు. కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలన్న డిమాండ్‌ను మోడీ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని వారు మండిపడ్డారు. అసంఘటిత కార్మికులందరికీ పిఎఫ్, పింఛను సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

వ్యాధుల నిర్మూలనే ఎంఐడి లక్ష్యం

ప్రజాశక్తి-కొమరాడ

తట్టు, రుబెల్లా తదితర వ్యాధులను పూర్తి స్థాయిలో నిర్మూలించడమే మిషన్ ఇంధ్ర ధనుష్ కార్యక్రమం లక్ష్యమని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి టి.జగన్మోహనరావు తెలిపారు. మండలంలో సోమినాయుడువలసలో మిషన్ ఇంధ్ర ధనుష్ టీకా కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. టీకా అర్హుల జాబితా వివరాలు, ఏ టీకాలు వేశారో పరిశీలించారు. ఈ వివరాలను వైద్య ఆరోగ్య శాఖ కొత్తగా చేర్చిన యూవిన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. తద్వారా అవసరమైన సందర్భాల్లో టీకా పూర్తయిన వారికి సర్టిఫికెట్‌ను ఇచ్చే వీలుంటుందని చెప్పారు. ఈ సందర్భంగా అక్కడ బుధవారం వైద్య సిబ్బంది టీకా వేసిన పిల్లలు, గర్భిణుల ఆన్‌లైన్ నమోదును పరిశీలించారు. తద్వారా జనరేట్ అయిన టీకా సర్టిఫికెట్‌ను అక్కడ టీకా కేంద్రంలో గర్భిణీకి అందజేసి, వాటి ఆవశ్యకతను తెలియజేశారు. పూర్తి స్థాయి టీకాలు వేసిన పిల్లలకు కూడా టీకా ధ్రువపత్రాన్ని అందజేయవచ్చన్నారు. సోమవారం ప్రారంభమైన మిషన్ ఇంధ్ర ధనుష్ కార్యక్రమాన్ని ఈ శనివారం వరకు కొనసాగించాలన్నారు. గతంలో ఏ కారణం వల్లనైనా టీకా వేయబడని పిల్లలకు ఈ కార్యక్రమంలో టీకా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయగౌడ్, ఎఎన్‌ఎం స్వాతిముత్యం, సిహెచ్‌ఒ జయంతి, అంగన్వాడీ సిబ్బంది లత, ఆశా కార్యకర్త ఉన్నారు.

టీకా సర్టిఫికెట్ అందజేస్తున్న డిఐఒ జగన్మోహనరావు

అడవి తల్లికి పాలాభిషేకం

ప్రజాశక్తి-సాలూరు

ప్రపంచ ఆదివాసీ ఉత్సవాల సందర్భంగా బుధవారం ఆదివాసీ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యాన పారమ్మకొండ వద్ద ఉన్న అడవి తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. సంఘం మన్యం జిల్లా అధ్యక్షులు జన్ని పైడిరాజు ఆధ్వర్యాన ఉపాధ్యాయులు, ఉద్యోగులు అడవి తల్లి విగ్రహానికి పాలతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం ఎన్ని చట్టాలున్నా ఇంకా వెనుకబాటుతనం ఉందని చెప్పారు. గిరిజనుల జీవన స్థితిగతుల్లో మార్పు తీసుకురావడానికి ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కె.జానకిరావు, సోములు, పణుకువలస సర్పంచ్ సీతారాం పాల్గొన్నారు.

అడవితల్లి విగ్రహం వద్ద నినాదాలు చేఉస్తన్న ఆదివాసీ ఉపాధ్యాయుల సంఘం నాయకులు

గరుగుబిల్లి : తోటపల్లి ప్రకృతి ఆదిదేవోభవ ప్రాంగణంలో జట్టు సంస్థ ఇడి ఎస్.ప్రహరాజ్ ఆదితల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో డోల్లు సింహాచలం నాయుడు, ప్రధానోపాధ్యాయులు జి.రవికుమార్, పద్మ, మురళీధర్‌రావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

మొక్క నాటుతున్న ఎంపిడిఒ పైడితల్లి, సర్పంచ్ ఇందుమతి, అధికారులు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని ఎంపిడిఒ జి.పైడితల్లి కోరారు. మండల కేంద్రంలో అమృత సరోవర్ పథకం కింద అభివృద్ధి చేసిన చెరువుగట్టుపై బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.ఇందుమతి, ఎపిఎం పి.అప్పలనాయుడు, ఎపిఒ గౌరినాథ్, సిసిలు చందాన తిరుపతిరావు, వి.లక్ష్మణరావు, బొంగు రామినాయుడు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని డుమ్మంగి సచివాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని సర్పంచ్ పాలక క్రాంతికుమార్ చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, టెక్నికల్ అసిస్టెంట్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మొక్క నాటుతున్న సర్పంచి క్రాంతి కుమార్

గుండెపోటుతో కెజిబివి ఉద్యోగి మృతి

ప్రజాశక్తి-కొమరాడ

మరణించిన సావిత్రి

గుండెపోటుతో కెజిబివి ఉద్యోగి హిమరిక సావిత్రి మృతి చెందిన ఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. మండలంలో దేవకోన పంచాయతీ అంటివలస గ్రామానికి చెందిన హిమరిక సావిత్రి (33) మెంటాడ మండలంలో కెజిబివిలో కొన్నేళ్లుగా అటెండర్‌గా పనిచేశారు. కొమరాడ కెజిబివికి బదిలీ కావడంతో మంగళవారం స్థానికంగా విధులకు హాజరయ్యారు. అనంతరం కన్నవారైనా కోమట్లపేట గ్రామానికి చేరుకొన్నారు. గుండెలో నొప్పిగా ఉందని చెప్పడంతో కూనేరు రామభద్రపురం పిహెచ్‌సికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసి, పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో చేర్చిన వెంటనే ఆమె మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సావిత్రికి ఇద్దరు కుమారులున్నారు.